క్లుప్తంగా

శ్రీరామనవమి పూజలు ప్రారంభం



పసుపు దంచుతున్న భక్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో శ్రీరామ నవమి ఆరంభ పూజలు బుధవారం నిర్వహించారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 24న సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు పసుపు దంచారు.

అయ్యప్ప స్వామికి పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మురపాకలో చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న రామ్‌దేవ్

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక బస్టాండ్ వద్ద సినీ హీరో రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా గ్రామానికి చెందిన ప్రగడ రామ్‌దేవ్ ఆనే యువకుడు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

గార: కె.మత్స్యలేశంలోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని ఎస్సై కె.కృష్ణప్రసాద్ బుధవారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద వసతులు, బందోబస్తుకు అనువైన అంశాలపై ఆరా తీశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



శంకరరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

ఎచ్చెర్ల క్యాంపస్: పాత పొన్నాడలో వైఎస్సార్ సీపీ నాయకుడు గంగు ఎర్రంనాయుడు కుమారుడు శంకరరావు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించి నివాళులు అర్పించారు. నాయకులు నేతింటి నీలమప్పడు, అల్లు రాజారావు, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

వీసీ రజినికి సన్మానం



వీసీ రజినీని సన్మానిస్తున్న బోధకులు, సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్, ఏయూ విశ్రాంత ఫిలాసఫీ ప్రొఫెసర్ కె.ఆర్.రజినికి విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బుధవారం ఫిలాసఫీ అండ్ రెలీజియస్ విభాగం ఆధ్వర్యంలో సన్మానించారు. తమ విభాగానికి చెందిన వ్యక్తి వీసీ కావటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

కౌన్సెలింగ్‌తో మానసిక సమస్యల పరిష్కారం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అరసవల్లి: మానసిక సమస్యల పరిష్కారానికి ప్రొఫెషనల్ సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరమని సైకాలజిస్ట్ పొన్నాడ రాజశేఖర్ సూచించారు. శ్రీకాకుళం డేఅండ్‌నైట్ కూడలిలో మైకేర్ ఆసుపత్రి, డాక్టర్స్ అండ్ డాక్టర్స్ ప్లాజాలో బుధవారం కౌన్సెలింగ్ ప్రక్రియను ఆయన ప్రారంభిస్తూ మాట్లాడారు. విద్యార్థుల్లో చదువుపై నిరాసక్తి, తల్లిదండ్రుల పెంపకంలో లోపాలు, లైఫ్‌స్టైల్, భార్యాభర్తల సమస్యలు ఇతరత్రా అంశాలపై పరిష్కారం కోసం సరైన కౌన్సెలింగ్ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు బుడుమూరు రమణ, గురుగుబిల్లి సంధ్య, పీఆర్వో సంఘ అధ్యక్షుడు జెఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక బాటలో పయనించాలి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



సత్యసాయి మందిరంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: అందరూ భక్తిభావంతో మెలగాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాంకర్స్ కాలనీలోని సత్యసాయి మందిరంలో మంగళవారం స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పోకడలతో పెడదారిన పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఆధ్యాత్మికమార్గం దోహదపడుతుందన్నారు. ఈ భవనంలో అందించే నైపుణ్య శిక్షణను యువత సద్వినియోగం చేసుకుని స్వయం శక్తితో ఎదగాలని ఆకాంక్షించారు. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. మందిర కన్వీనర్ ఎ.ప్రసాదరావు మాట్లాడుతూ యువత స్వయంశక్తిపై నిలబడేందుకు అవసరమైన అన్ని రకాల శిక్షణలు ఇక్కడ ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే టైలరింగ్, మగ్గం వర్క్, ఏసీ మిషన్ రిపేరు, బ్యుటీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 300 మంది యువత శిక్షణ పొందారని వివరించారు. శాశ్వత భవనం సమకూర్చాలనే ఉద్దేశంతో దాతల సహకారంతో రూ.23లక్షల వ్యయంతో ప్రస్తుతం ఉన్న మందిరం మేడపైనే భవనం నిర్మించినట్లు తెలిపారు. మే 1 నుంచి అదనంగా ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సు కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మండవిల్లి రవి, అంధవరపు ప్రసాద్, సంతోష్, మాజీ వీసీ గుంట తులసీరావు, డోకి జనార్దనరావు, ఉరిటి చిట్టిదాస్, మోణింగి మురళీమోహనరావు, కోరాడ గుప్తా, ప్రమీల, సుజాత, దివ్య, మణిమాల, సుమ, యామిని, ప్రసాదరావు, సుధ, నాగేశ్వరరావు, బోయిన నర్సింహమూర్తి, సత్యనారాయణ, వెంకటరామన్, శిల్లా అరుణ, ఎస్.రామచంద్రరావు, కిల్లాన ఫల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం..!



ఇసుకబండిపై నిద్రపోతున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కొందరు ఇసుక బళ్ల నిర్వాహకులు నిర్లక్ష్యంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. సూర్యుడు అస్తమించిన గంట కాలంలోనే ఎడ్లబండిపై హాయిగా నిద్రపోతూ ప్రయాణం చేస్తున్నారు. ఎడ్లబండిపై రేడియం స్టిక్కర్లు తప్పనిసరి అని పోలీసులు హెచ్చరించినా అవేవీ తమకి కాదన్నట్లు కొందరు నిర్లక్ష్యంగా ఇసుక రవాణా చేస్తున్నారు. గతంలో ఆదివారంపేట సమీపంలో ఎడ్లబండిని ఓ యువకుడు బైక్‌తో ఢీకొని మరణించిన సంగతి తెలిసిందే. అయినా ఇసుకబళ్ల నిర్వాహకులు నిర్లక్ష్యంగా పడుకుని ఎద్దులు వాటంతవే వెళ్తున్నా పట్టించుకోకుండా ప్రయాణాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా బళ్లను నడుపుతున్న వారికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

విజయగణపతికి అష్టోత్తర శత దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో స్వామికి బుధవారం అష్టోత్తర శత దీపారాధన నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



ఆలయంలో దీపారాధన

కన్వర్జ్ ఫెస్ట్ బ్రోచర్ విడుదల



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో ఏప్రిల్ 3, 4 తేదీల్లో కన్వర్జ్ 2కే24 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు ఆధ్వర్యంలోని ఫ్యాకల్టీ సభ్యులు విడుదల చేశారు. రెండు రోజుల పాటు సాంకేతిక అంశాల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, పలు కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ చెప్పారు.

స్థల వివాదంపై
కేసు నమోదు

రణస్థలం : మండలంలోని వెల్పురాయి గ్రామంలో మూడు సెంట్లు స్థల వివాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేబారికి నర్సింహులు, దేబారికి రాము మాస్టారు కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్థల వివాదం జరుగుతోంది. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 25న ఇరువర్గాల మధ్య కొట్లాట జరగడంతో ఒక వర్గానికి చెందిన దేబారికి రాధ, మరో వర్గానికి చెందిన దేబారికి నర్సింహులు, ఉగాదిలు గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు ఇరువర్గీయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాడి రైతులకు
అండగా పశు బీమా

ఎచ్చెర్ల: పాడి రైతులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి బి.గాయిత్రి కోరారు. బుధవారం పెద్దలింగాలవలసలో పశు బీమా ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవు, గేదెలకు సంబంధించి ఇన్సూరెన్స్ తీసుకుంటే ప్రమాదాల సమయంలో పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో వెటర్నరి అసిస్టెంట్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

శ్రీకాకుళం అర్బన్: సినీ నటుడు కొణిదెల రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా రామ్ చరణ్ యువశక్తి ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్ బ్యాంకు వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. 27 మంది సభ్యులు రక్తదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: రూరల్ మండల పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ కింద విద్యుత్ ఆధునీకరణ పనులు చేపడుతున్న క్రమంలో కనుగులవానిపేట 33/11 కె.వి.సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కనుగులపేట, కళ్లేపల్లి, మోపసుబందరు, ఇప్పిలి, పెద్దగణగళ్లవానిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

• ఓటు హక్కే వజ్రాయుధం



జి.సిగడాం: ఎందువలో ర్యాలీ నిర్వహిస్తున్న వాన ప్రమీల



ఎచ్చెర్ల: అజ్జరాం చెరువులో ఉపాధి వేతనదారులకు అవగాహన



ఎచ్చెర్ల: ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి వ్యక్తి ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రామ్మూర్తి కోరారు. బుధవారం పొన్నాడ, అజ్జరాం, కొత్తపేట, ఎచ్చెర్ల గ్రామాల్లో ఎస్‌వీఈఈపీ ఓటరు అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఓటు మన హక్కు అని స్పష్టం చేశారు. ఓటుహక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వెలుగు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని ఎందువ గ్రామంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల ఆధ్వర్యంలో ఓటు హక్కు ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి బూత్‌లో 80 శాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు.

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని అనివెట్టి మండపంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి హుండీ కానుకల ఆదాయం లెక్కింపు చేపడతామని ఈవో ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి నిబంధనల ప్రకారం లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

లజపతిరాయ్‌కు మాతృవియోగం



సుశీలమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ తల్లి సుశీలమ్మ (89) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సొంత గ్రామం టెక్కలి మండలం తలగాం గ్రామంలో గురువారం ఉదయం అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మిమిక్రీ కళాకారుడు నందికేశ్వరరావుకు సన్మానం



నందికేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన మిమిక్రీ కళాకారుడు లోకనాథంనందికేశ్వరరావు జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా నందికేశ్వరరావు ఇంట 'ముంగిట సన్మానం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ మాట్లాడుతూ శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతి ఏడాది ఒక కళకారుని ఇంటికి వచ్చి సన్మానం చేయడం అభినందనీయమన్నారు. పాత్రికేయుడు నల్లి ధర్మారావు మాట్లాడుతూ ప్రతిభ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకున్న వ్యక్తి నందికేశ్వరరావు అని కొనియాడారు. కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు మాట్లాడుతూ పదేళ్లుగా ఎందరో కళాకారుల ఇళ్లకు వెళ్లి ముంగిట సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యదర్శి రామచంద్రదేవ్, బి.ఎ.మోహనరావు, కంచరాన అప్పారావు, నిక్కు హరిసత్యనారాయణ, పైడి సత్యవతి, బీఎంఎస్ పట్నాయక్, నిక్కు అప్పన్న, శివప్రసాద్, పొట్నూరు వెంకటరావు, బెహరా నాగేశ్వరరావు, పాపారావు గురుస్వామి, కె.వి.జె. రాధాప్రసాద్, ప్రభాకరరావు, కలగ గణేష్‌యాదవ్, గజల్ వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడారిపోలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని న్యూకాలనీలో సత్యసాయి మందిరం పక్కన ఉన్న గుడారి పోలమ్మ విగ్రహ పునఃప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. దుర్గామహాలక్ష్మీ ఆలయ ప్రధాన అర్చకులు తెన్నేటి విద్యాధర శాస్త్రి ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, చైతన్య ప్రవేశ, కళావాహన, నేత్రోన్మీలనం, దర్పణ దర్శనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దివ్యదర్శనం గావించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మసీదు పాలెం గుడారి పోలమ్మ యువజన సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

సీసీ కెమెరాలు తప్పనిసరి



రామలక్ష్మణ జంక్షన్ సమీపంలో రాత్రిగస్తీ కాస్తున్న సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం ఒకటో పట్టణ సర్కిల్ పరిధిలోని దేవాలయాలు, రైస్‌మిల్లుల్లో సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ తప్పనిసరిగా ఉండాలని సీఐ లెంక సన్యాసినాయుడు అన్నారు. నైట్ బీట్ విధుల్లో భాగంగా సీఐ మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వేకువఝాము నాలుగు గంటల వరకు నగర పరిధిలో దేవాలయాలు, ముఖ్య కూడళ్లలో సిబ్బందితో గస్తీ కాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర శివారులో ఒకే ఇల్లు ఉన్న చోట అప్రమత్తంగా ఉండాలని, దూరప్రాంతాలకు వెళ్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. ఉగాది, అమ్మవారి సంబరాల దృష్ట్యా కొంతమంది సెంటిమెంటు కోసం మిల్లులు, దుకాణాల్లో రూ.లక్షల నగదు, విలువైన వస్తువులు ఉంచేస్తారని, అది మంచిది కాదన్నారు.